


**మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.**

(గత సంచిక తరువాయి)

*1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.*

*అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.*

*ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లోకి పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.*

*అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'. ఇది మళ్లీ రెండు భాగాలు. అవేమిటో అప్పుడు చూద్దాం. ఈ అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.*

*రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.*

# మొదటి భాగం: పీజీ టు కేజీ

***కథాప్రారంభం***

న్యూఢిల్లీ విమానాశ్రయం సెక్యూరిటీ హాల్లో నేను, నాలాంటి మరికొందరు సైంటిస్టులు కూర్చుని ఉన్నాం. అందరి ముఖాల్లోనూ ఏదో ఉద్వేగం. వాళ్లని చూస్తుంటే వాళ్లు వాళ్లలా కాక నా ప్రతిబింబాల్లా అనిపించారు. ఆ ప్రతిబింబాల్ని అసలు మనుషులుగా మార్చుకుందుకు నా మెదడు కొంచెం శ్రమపడింది.

అప్పుడు నేను గుర్తించిన మొదటి మార్పు – భూషణ్ నా పక్కన లేడు. నాకు కాస్త దూరంగా మరెవరి పక్కనో ఉన్నాడు. నా పక్కన కూర్చున్నది సుందరం.

సుందరం తెలుగువాడు. ఆ ఒక్క కారణంగా అప్పుడతడు ఆత్మీయుడనిపించింది. నా మనోభావాలు నా భాషలో ప్రకటించుకునే అవకాశమింకా నాకున్నదన్న గ్రహింపు నాకెంతో ధైర్యాన్నిచ్చింది.

అంతలో ఏదో చప్పుడు వింతగా, కొత్తగా!

ఆస్ట్రేలియానుంచి హాంగ్కాంగ్ మీదుగా బయల్దేరిన లుఫ్తాన్సా డిసి 10 విమానం వచ్చి ఆగిన చప్పుడది. అలాంటి శబ్దాన్ని ఇదివరలో ఎన్నోమార్లు ఎక్కడెక్కడో విని ఉన్నాను. కానీ ఈ శబ్దానికో ప్రత్యేకత ఉంది. ఈ శబ్దం నన్ను పిలుస్తోంది. కాసేపటికి నేనూ ఈ శబ్దంలో భాగమౌతాను.

సెక్యూరిటీ చెకింగ్ మొదలైంది. సెక్యూరిటీ ఆఫీసర్ ఒకతన్ని సోదా చెయ్యగా చాకు ఒకటి కనబడింది.

"అది పళ్లు కోసుకునేది. తాళంచెవులగుత్తితోపాటు ఉంది" అన్నాడతను భయంభయంగా చూస్తూ.

సెక్యూరిటీ ఆఫీసరు ఆ చాకునీ అతన్నీ మార్చిమార్చి చూశాడు. 'దాంతో గొంతులూ కోయొచ్చు' అంటే ముందు అతనే వణికిపోయి మూర్ఛపోతాడనిపించినట్లుంది. ఆఫీసర్ అదోలా నవ్వి, ఆ చాకు అతనికి ఇచ్చేశాడు.

"హైజాకింగ్లు పెరిగిన ఈ రోజుల్లోనూ మన సైంటిస్ట్ల మొహాలు చూస్తే – దగ్గర పిస్టలున్నా వదిలేస్తారీ సెక్యూరిటీ ఆఫీసర్లు" అన్నాను సుందరంతో.

సుందరం నవ్వాడో లేదో, మొహంలో ఉద్వేగం ఇతర భావప్రకటనల్ని కమ్మేసింది. అతనికీ అది తొలి విమాన ప్రయాణమే – అదీ పాశ్చాత్యదేశానికి!

అందరం వెయిటింగ్ హాల్నించి బయటపడ్డాం. విమానం దగ్గరకి తీసుకు వెళ్లడానికి బస్సు ఒకటి సిద్ధంగా ఉంది. ప్రయాణీకులంతా అది ఎక్కాం. ఆ క్షణంలో ఎవరి ధ్యాసవారిదే! ఇతరుల సంగతి గుర్తులేదు.

బస్సు విమానం దగ్గర ఆగింది. మేము బస్సు దిగి ఫ్లైట్ బోర్డింగ్ నిచ్చెన ఎక్కాం.

తొలిసారిగా విమానం లోపల అడుగు పెట్టానేమో, అదోరకమైన వింత అనుభూతి కలిగింది.

***అమృత పానమున గగనయానమున***

లుఫ్తాన్సా డిసి 10 విమానం. అప్పుడున్న అధునాతన విమానాల్లో ఒకటి. మాది ఎకానమీ క్లాసు. అదే అద్భుతంగా ఉంది. ఇంకా ఫస్టుక్లాసెలాగుంటుందిట. అదెలాగుంటుందో మరి!

విశాలంగా ఉంది. ఇంపైన పరిమళం. బయటకులా ఉక్క లేదు. చల్లగా హాయిగా ఉంది. పొగ తాగేవారికి వేరే కంపార్టుమెంట్ ఉంది. నేను పొగత్రాగని వారి కంపార్టుమెంట్లో ఉన్నాను.

అంతవరకూ పక్కనమాత్రమే లేడనుకున్న భూషణ్ – ఇప్పుడు కంపార్ట్మెంట్ కూడా మారాడు. లోపల చాలా సీట్లు కాళీగా ఉన్నాయి. నాది కిటికీ పక్క సీటు. సుందరం నా పక్కనే కూర్చున్నాడు.

విమానం బయల్దేరుతుందట. ప్రయాణీకులు బెల్టులు బిగించుకోవాలని హెచ్చరిక వినబడింది స్పీకర్లో. అది వింటుంటే భయమేసింది. విమానం కదిలేటప్పుడు బెల్టు కట్టుకుని తీరాలని – ఓ అనుభవజ్ఞుడు నన్ను భువనేశ్వర్లో పదేపదే హెచ్చరించాడు. కానీ ఇప్పుడా విషయం మర్చిపోయాను. స్పీకర్లో హెచ్చరిక విని ఉండకపోతే ఏమైపోయేవాణ్ణో అనుకుంటూ బెల్టు కట్టుకున్నాను. నాతోపాటే డిటో భావాలతో సుందరమూనూ.

లుఫ్తాన్సా ఎయిర్ హోస్టెస్ యూనిఫాం రంగు పసుపు కాబోలు. మిసమిసలాడే ఆ పడుచులకా రంగు బట్టలెంతో అందాన్నిచ్చాయి. విమానం కదిలేముందే స్పీకర్లో మరో హెచ్చరిక: లోపల గాలి ఒత్తిడి బాగా తగ్గిస్తారు, కాసేపు మాటలు సరిగా వినిపించకపోతే కంగారు పడొద్దని. ఈలోగా ఎయిర్ హోస్టెస్ వచ్చి నాకూ సుందరానికీ చెరో చిన్న పొట్లాం ఇచ్చింది. చాక్లెట్టేమో అనుకుని చింపి చూశాం.

తెల్లగా ఉంది. తినే పదార్థంలా లేదు. ఏమిటా అని నేనాలోచిస్తుండగా, "దూది" అన్నాడు సుందరం.

నిజమే – అది దూదే! కానీ మాకిప్పుడు దూదితో ఏంపని?

నేను సుందరంవంక చూస్తే, అతను మరోపక్కకి చూశాడు. ఎటుచూసినా పక్కకు తిరిగిన తలలే కనిపిస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా ఇటు తిరిగినా, వాళ్లలో నా ప్రతిబింబమే కనబడుతోంది.

"నేనిప్పుడు సైంటిస్టు రావుని కాదు. బారిస్టరు పార్వతీశం ఐపోయాను! ఈ దూదిని ఏంచేద్దాం?" అన్నాను సుందరంతో.

సుందరం నవ్వి, "దూదికదా, పోనీ చెవిలో పెట్టుకుందాం" అన్నాడు.

అప్పటికే మాటలు సరిగ్గా వినిపించడం లేదు. కానీ అతను చెవిలో దూది పెట్టుకోవడం చూసి, ఆ మాటల్ని ఊహించుకున్నాను. నేనూ దూదిని చెవిలో పెట్టుకున్నాను. మమ్మల్ని చూసి మరికొందరు అలాచేశారు.

దూది చెవిలో ఉంచుకుంటే కొంచెం హాయిగానే ఉంది. మేము చేసింది సరైనదేనని తరువాత తెలిసింది.

తెల్లవారుఝామున సరిగ్గా నాలుగు గంటల అయిదు నిముషాలకు విమానం కదిలింది. కిటికీలోంచి కిందికి చూస్తున్నాను. అన్నయ్య, వదిన ఒక్కసారి కనబడితే బాగుండుననిపించింది. కానీ అదేమన్నా రైల్వే ప్లాట్ఫారమా – ఎయిర్పోర్టో్ల రన్వే. ఎవ్వరూ కనబడలేదు.

విమానం రన్వే మీద నెమ్మదిగా కదిలి వేగం పుంజుకుని పెద్ద శబ్దం చేస్తూ గాలిలో తేలింది.

చూడ్డంవల్ల ఎగిరినట్లు తెలిసింది కానీ, ఎగిరేటప్పుడు ఏ కుదుపూ లేదు.

కాసేపటికి విమానం లోపల గాలి ఒత్తిడి పరిస్థితి మెరుగైంది. చెవిలో దూది ఉన్నా కూడా మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి. అప్పుడు నేను, సుందరం దూది తీసేశాం. మాతోపాటే చాలామంది తీసేశారు.

స్పీకర్లో ప్రయాణీకులకు స్వాగతం పలుకులు వినబడ్డాయి. కొత్త కదా – ఆత్రుతగా, శ్రద్ధగా విన్నామవి.

మా విమానం థార్ ఎడారి, కరాచీ, టెహరాన్, అంకారా, ఇస్తాంబుల్, సోఫియా, ఆల్ప్ పర్వతాలు మీదుగా పయనించి ఫ్రాంక్ఫర్ట్ నగరం చేరుకుంటుందట. భూమికి నలభైఅయిదువేల అడుగుల ఎత్తున గంటకు అయిదొందల ముప్పైమైళ్ల వేగంతో పయనిస్తుందిట. మొత్తం నాలుగు వేల రెండు వందల మైళ్ల ప్రయాణానికి సుమారు ఎనిమిది గంటలు పడుతుందిట.

విమానంలో టెలివిజనుంది. టెలివిజన్ గురించి వినడమే కానీ మాకది కొత్త. అందులో సంగీత కార్యక్రమాలు చూడొచ్చు, వినొచ్చు. వినడానికి ప్రతి సీటు వద్దా ఇయర్ ఫోన్ ఏర్పాటుంది.

అంతలో ఒక పురుషుడు, ఒక మహిళ వచ్చి – ప్రయాణీకుల ముందు నిలబడి విన్యాసాలు మొదలెట్టారు. వాళ్లేమేమో మాట్లాడుతున్నారు కానీ, రాత్రి తెల్లవార్లూ నిద్రలేక మెదడు మొద్దుబారి ఉంది. ఒక్క ముక్క కూడా బుర్రకెక్కలేదు. టెలివిజన్మీద ఆసక్తి లేనివారికి వినోద ప్రదర్శన కాబోలు అనుకున్నాను.

చాలా తొందరగానే ముగిసిందా ప్రదర్శన!

సుందరంతో, "మనకి స్కిట్ నచ్చలేదని అర్థమైనట్లుంది. తొందరగానే ముగించారు" అని నిట్టూర్చాను.

సుందరం వెంటనే, "అది స్కిట్ కాదు. విమానంలో అనుకోని ప్రమాద పరిస్థితి ఏర్పడితే ఏం చేయాలో చేతలతో చూపిస్తూ చెప్పారు. మీరు సరిగ్గా వినలేదా?" అన్నాడు.

"శుభం పలకరా మంకెన్నా అంటే ఏదో అన్నట్లు, విమానం ఎక్కగానే ప్రమాదం గురించిన ప్రస్తావన ఏమిటి?" అని విసుక్కున్నాను.

"అలాగనకండి. కీడెంచి మేలెంచమని కూడా అన్నారుగా, అందుకని!" అన్నాడు సుందరం.

అప్పుడు నాకు భయమేసింది. "వాళ్లేం చెప్పారో నాకు చెబుతారా?" అన్నాను ఆత్రుతగా.

"వాళ్లేం చెబుతున్నారో తెలిసింది కానీ, ఏం చెప్పారో నా బుర్రకెక్కలేదు. ఐనా భయపడకండి. వాళ్లు కీడెంచి మేలెంచారు కానీ, మనం మేలొకటే ఎంచుదాం" అని సుందరం నాకు ధైర్యం చెప్పాడు.

అతని ధైర్యం చూస్తే నాకో అనుమానమొచ్చింది. ప్రమాదవేళలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అతనికి అర్థమయ్యాయి కానీ, అవి నాకు చెప్పాలంటే – నా ముందు నిలబడి వాళ్లకిలాగే విన్యాసాలు చెయ్యాలనుకుని ఉంటాడు. అదిష్టంలేక అబద్ధం చెప్పాడు. ఇప్పుడు నిజంగా ప్రమాదం జరిగితే తను తప్పించుకుంటాడు. నేను ఇరుక్కుపోతాను. అసలే ప్రయాణాల్లో నా హిస్టరీ అంతంతమాత్రం. ఒక్కసారి వళ్లంతా భయంతో వణికింది. ఇందాకటి హెచ్చరికని శ్రద్ధపట్టి విననందుకు నన్ను నేనే నిందించుకున్నాను.

ఉన్నట్లుండి సుందరం లేచి నిలబడి, "పడుకున్నా పడుకోకపోయినా, రాత్రి గడిచి తెల్లారేక, బ్రష్ చేసుకోకుండా ఏం తినలేను నేను" అంటూ దగ్గరున్న హ్యాండ్బ్యాగులోంచి ఆ సరంజామా తీశాడు.

"థాంక్ గాడ్" అనుకున్నాను. ఎందుకంటే నాదీ అదే పరిస్థితి. ఈ సమయంలో సుందరం పక్కనుండడం నాకు మార్గదర్శకం. నాకంటే అతనికి చొరవ కూడా ఎక్కువ. టాయ్లెట్ గదిలో ఫ్లషింగ్ ఎలా చెయ్యాలో తెలుసుకుని వచ్చేక నాకు టిప్స్ కూడా ఇచ్చాడు. తర్వాత నేనూ వెళ్లి ముఖప్రక్షాళనం చేసుకొచ్చాను.

కూర్చున్న సీటుని వెనక్కి వాల్చడానికున్న మీటలతో సహా అక్కడ ప్రతీదీ మాకు కొత్తగానే ఉంది. వాటిలో కొన్ని మేము విన్నవే. ఐతే వినడానికీ, చూడ్డానికీ ఉన్న తేడా అప్పుడే మాకు అర్థమైంది.

కాసేపటికి ఎయిర్ హోస్టెస్ ఓ బండి తోసుకుంటూ మా దగ్గరకొచ్చింది. శాకాహారమా, మాంసాహారమా అనడిగింది. నేనూ, సుందరం – ఇద్దరం శాకాహారులమే! ఫ్రూట్సలాడ్, ఆరంజ్ జ్యూస్ వగైరా కొన్ని పదార్థాలు మా ముందుంచబడ్డాయి. వెజిటబుల్ కట్లెట్ ఆకారాన్ని చూసి మేమిద్దరం మాంసాహారమని అనుమానించి దాన్నలాగే వదిలిపెట్టేశాం. అయితే పాపం భూషణ్ పక్క కంపార్ట్ మెంటు నుంచి వెతుక్కుంటూ మా సీటు దగ్గరకొచ్చి, "ఈ కట్లెట్ పూర్తిగా శాకాహారం. నీకు అనుమానం ఎక్కువ కదా, ఎందుకైనా మంచిదని నీకు చెబుదామని వచ్చాను" అని చెప్పి వెళ్లాడు.

నా పట్ల అతడి కన్సర్న్ కి చలించిపోయాను. థాంక్స్ చెప్పాను. అతను వెళ్లిపోయాడు. తరువాత మళ్లీ అతనూ, నేనూ విమానంలో కలుసుకోలేదు.

భూషణ్ ధర్మమా అని నేను సుందరం కట్లెట్ తిన్నాం. రుచి మాట ఎలాగున్నా – అది తినడంవల్లనే కడుపు కాస్త బరువెక్కింది.

ఆ ప్రయాణంలో నాకూ సుందరానికీ కూడా చెప్పుకోదగినవీ, చెప్పుకోకూడనివీ ఎన్నో సందేహాలు వచ్చాయి. ఊహతోనో, అనుకోకుండానో తీరినవి కొన్ని, తీరనివి కొన్ని. తీరనివాటికి నవ్వుకున్నాం తప్పితే తీర్చుకునేందుకు ప్రయత్నించలేదు.

ఫలహారం కాగానే టెలివిజన్ ఆన్ అయింది. ఏదో సినిమా!

ఇండియాకు వచ్చిన విదేశీ చిత్రాలు సెన్సారై వస్తాయి. సెన్సారు కాని విదేశీ చిత్రం చూసే తొలి అవకాశం నాకు వచ్చింది. అందువల్ల శ్రద్ధగా చూడాలనే అనుకున్నాను. కానీ కళ్లు సహకరించలేదు. నాకు తెలియకుండానే అవి మూతపడ్డాయి.

మెలకువ వచ్చేసరికి సినిమా పూర్తి కావస్తోంది. అందువల్ల ఆ సినిమా గురించి నాకేం తెలియలేదు.

మెలకువ వచ్చేసరికి మాకు తెలిసిన విశేషమేమిటంటే – విమానంలో ఈ పర్యాయం చాలామంది శాకాహారు లున్నారుట. డిమాండ్ వారి అంచనాకు మించిపోవడంతో సిబ్బందికి కాస్త ఇబ్బంది అయిందిట.

మేము కాలానికి ఎదురు వెడుతున్నాం. అందువల్ల చీకటినుంచి వెలుతురులోకి రావడానికి కాసేపు పట్టింది.

విమానంలోంచి చూస్తుంటే కింద కనబడే ప్రతి దేశం గురించీ, నగరం గురించీ స్పీకర్లో వివరాలు వినబడుతున్నాయి. నలభైఅయిదువేల అడుగుల ఎత్తునుంచి, కింద కనబడే దృశ్యాలు చూస్తుంటే అద్భుతంగా అనిపించింది. ముఖ్యంగా అరబ్ దేశపు నగరాలు, కటికశిలలపై అక్కడక్కడ ఊళ్లు మొలిచినట్లు చిత్రంగా ఉన్నాయి. ఇస్తాంబుల్, సోఫియా నగరాలను పైనుంచి చూశాం. పూర్తిగా మంచుతో కప్పబడ్డ ఆల్ఫ్ పర్వతాలను చూస్తూంటే, స్వదేశంలో ఉండి హిమాలయాలను చూడలేకపోయినా, ఈ హిమాలయాలను చూడగలిగాననుకుని తృప్తిపడ్డాను. ఆల్ఫ్ పర్వతాలు కనబడ్డాయంటే జర్మనీలోకి ప్రవేశించినట్లే! ఆ పర్వతాలనానుకునే మ్యునిచ్ నగరం ఉంది.

విమానంలో ప్రతి సీటువద్దా ఉత్తరాలు రాసుకునేందుకు వీలుగా లెటర్ పాడ్స్ ఉన్నాయి. ఎన్నో ముఖ్యవిశేషాలు నోట్ చేసుకుందుకవి ఉపయోగించాయి.

నేనూ సుందరం చాలా విశేషాలు మాట్లాడుకున్నాం. ఒకరి అడ్రసులు ఒకరు నోట్ చేసుకున్నాం.

ఫ్రాంక్ ఫర్ట్ జర్మన్స్ ఫ్రాంక్ ఫుర్ట్ అంటారు. నా టైమ్ ప్రకారం పన్నెండు గంటల ఇరవైఅయిదు నిముషాలకు ఫ్రాంక్ ఫర్ట్ విమానాశ్రయంలో మా విమానం దిగింది. ఒక్క నిముషం కూడా ఆలస్యం కాలేదట. అదక్కడ మామూలేనని విని ఉన్నప్పటికీ, అప్రయత్నంగా ఆశ్చర్యపోయేశాను.

అప్పుడు జర్మనీలో స్టాండర్డు టైము ఏడు గంటల యాభైఅయిదు నిముషాలు. కొంతకాలంపాటు నా వాచీకింక ఇండియన్ టైముతో పనిలేదు. అందుకని ఆ ప్రకారం టైము సరిదిద్దుకున్నాను. కాలానికి ఎదురు ప్రయాణం చేయడంవల్ల అప్పుడు నా వయస్సు నాలుగున్నర గంటలు తగ్గింది.

ఫ్రాంక్ ఫర్ట్ ఎయిర్ పోర్ట్ అంతర్జాతీయంగానే చాలా పెద్దదిట. ఒకే పర్యాయం రెండువందల విమానాలు కదిలి వెళ్లే సదుపాయముందిట.

న్యూఢిల్లీలో అయితే ఎయిర్ పోర్ట్ నుంచి కొంతదూరం నడిచి, బస్సెక్కి, దిగి – విమానం ఎక్కాం. ఇక్కడలాకాదు. విమానంలోంచి సరాసరి విమానాశ్రయంలోకి దిగాం. అందువల్ల బయట వాతావరణం ఎలాగుందో మాకు తెలియలేదు. విమానాశ్రయం ఎయిర్కండిషన్డ్. చల్లగా ఉంది. ఆ చల్లదనం ఉక్కనుంచి కాపాడేదే తప్ప, వంటిని వణికించేది కాదు. ఢిల్లీలో నేను కొనుక్కున్న స్వెటరింకా నా భుజంమీదే ఉంది.

మాతోపాటు డాడ్ సంస్థకు చెందిన అధికారిణి ఇంగా రావెన్ బయల్దేరి వస్తోంది. ఆమె డాడ్ స్కాలర్స్ అందర్నీ విమానాశ్రయంలో ఒకచోట సమావేశపరిచింది. అక్కడకు జర్మనీలోని డాడ్ సంస్థనుంచి కొందరు వచ్చారు. వాళ్లు అక్కణ్ణించి స్కాలర్స్ని తమ తమ గమ్యాలకు చేర్చే ఏర్పాట్లతో వచ్చారు.

నేను ఫ్రాంక్ ఫర్ట్ నుంచి మరో విమానంలో హనోఫర్ (ఇంగ్లీషులో ఈ నగరం పేరు హనోవర్గా వాడుకలో ఉంది) వెళ్లవలసిఉంది. అక్కణ్ణించి ల్యూనబర్గ్కు ట్రైన్లో వెళ్లాలి. నా గురించి బుక్ చేసిన ట్రైన్ టికెట్ అక్కడే నాకు అందింది.

విమానాశ్రయంలో ఫారిన్ ఎక్స్ఛేంజ్ సదుపాయముంది. అప్పటికి నా దగ్గర ఇరవై మార్కులూ, ఎనిమిది డాలర్లూ ఉన్నాయి. డాలర్లను మార్చగా పంతొమ్మిది మార్కుల అరవై ఫెన్నిగ్స్ వచ్చాయి. మనకి పైసల్లాగే వీళ్లకి ఫెన్నిగ్స్. వంద ఫెన్నిగ్స్ ఒక మార్కు అవుతుంది.

ల్యూనబర్గ్ వెళ్లవలసినవాళ్లం మొత్తం నలుగురు ఇండియన్సూ, ముగ్గురు మలేషియన్సూ ఉన్నార. ఇండియన్స్ నలుగురూ మగవాళ్లమే కానీ మలేషియన్సులో ఒక యువతి కూడా ఉంది. ఇండియన్స్ నలుగురూ ఒక గుంపుగా చేరాం. మలేషియన్స్ ముగ్గురూ ఒక గుంపు అయ్యారు.

హనోఫర్ వెళ్లే విమానం తొమ్మిది గంటల నలభై నిముషాలకు ఏ-13 ప్లాట్ ఫాం నుండి బయల్దేరుతుందన్నారు. ప్లాట్ ఫారానికి దారి చూపారు. 13 నా లక్కీ నంబర్ అని మనసులో మురిశాను.

భూషణ్, సుందరంల దగ్గర వీడ్కోలు తీసుకున్నాను. తోడు లేదని సుందరం కాస్త దిగులుగా ఉన్నాడు. అతడు వెళ్లే ఊరు బ్రీన్. ఈ బృందంలో బ్రీన్ వెడుతున్న భారతీయుడు అతనొక్కడే.

జర్మనీలో మా కార్యక్రమం మొత్తం పదహారు నెలలు. అందులో మొదటి నాలుగు నెలలూ జర్మన్ భాష నేర్చుకోవాలని నియమం. భాష నేర్చుకునేందుకు అందర్నీ ఒకే ఊరు పంపరు. మమ్మల్ని కొన్ని గుంపులుగా విడదీసి దేశంలో నలుమూలలకూ పంపుతారు. విదేశీయులు జర్మన్ పౌరులతో మరింత బాగా కలసి మెలసి ఉండి వారి భాషనూ, సంస్కృతినీ బాగా అవగాహన చేసుకునేందుకు ఈ విధానం సహకరిస్తుందన్నది వారి ఉద్దేశ్యం. అది సబబైనదే అని నాకు అనిపించింది.

మనం ఎంతటి విభిన్న సంస్కృతిలో మసలాల్సి వచ్చినా, మనలాంటివారే అక్కడ చాలామంది ఉంటే కనుక – ఆ సంస్కృతి ప్రభావం మనపై ఉండక పోవచ్చు. భువనేశ్వర్ లో నేను అయిదు సంవత్సరాలనుంచి ఉంటున్నాను. అక్కడ మా కాలనీలో పాతిక తెలుగు కుటుంబాలున్నాయి. అందువల్ల నాకు ఒరియా భాష కూడా సరిగా పట్టుబడలేదు. పట్టుబడేందుకు కృషి చేయవలసిన అవసరం కూడా నాకు కనబడలేదు. ఎందుకంటే ఆఫీసులో వ్యావహారిక భాష ఆంగ్లం. సామాజికంగా వ్యవహరించడానికి తెలుగువారు తగినంతమంది ఉన్నారు. ఊళ్లో వ్యవహరించడానికి కొంత హిందీ, కొంత పొడిపొడి ఒరియా చాలు.

సరిగ్గా తొమ్మిది గంటల నలభై నిముషాలకు ఫ్రాంక్ఫర్ట్లో మా విమానం బయల్దేరింది. అంతర్జాతీయ విమాన యానానికీ, ప్రాంతీయ విమానయానానికీ – తేడా ఉంటుందని అప్పుడే నాకు బాగా తెలిసింది. ఈ విమానం చిన్నదిగా, ఇరుగ్గా ఉంది. డిసి 10లో ప్రయాణం చేశాక – రాజుని చూసిన కళ్లతో మొగుణ్ణి చూసినట్లుగా ఉంది. ఎటొచ్చీ నేనిప్పుడు మరీ పార్వతీశంలా లేను. కాస్త మెరుగయ్యాను. అవసరమైన వివరాలు చాలావరకూ ముందుగానే తెలిశాయి.

నిముషమైనా ఆలస్యం లేకుండా పదిన్నరకల్లా విమానం హనోఫర్ విమానాశ్రయంలో దిగింది. ఇక్కడ కూడా బయటి వాతావరణానికి గురి కాకుండా సరాసరి విమానాశ్రయంలోనే దిగాం.

న్యూఢిల్లీలో లోడ్ అయిన మా సామాన్లు సరాసరి ఇక్కడకు చేరాలి. సామాను కలెక్ట్ చేసుకునే చోటుకి వెళ్లాం. ఈ విమానాశ్రయం చాలా చిన్నది. ఇంచుమించు న్యూఢిల్లీ విమానాశ్రయం అంతే ఉంది. ఉన్న తేడా అల్లా పరిశుభ్రత! సినిమా కోసం వేసిన సెట్టింగులా ఎంతో నీట్గా ఉంది.

సామాన్లు తీసుకోవలసినచోట, వలయాకారంలో ఓ బెల్ట్ తిరుగుతోంది. దానిమీద సామాన్లున్నాయి. నేనొక చోట నిలబడ్డాను. కాసేపటికి నా సూట్కేసు వచ్చింది. గుర్తుపట్టడానికి ఒక్క క్షణం ఆలస్యమైంది. ఆలోగా అది నన్ను దాటి వెళ్లిపోయింది. నా సూట్ కేసు నాకు

దక్కదేమోనని భయపడ్డాను. కానీ ఆ భయం క్షణికం మాత్రమే! అది మళ్లీ మళ్లీ అలా తిరుగుతూంటుందని స్ఫురించింది. రెండోసారి నా ముందుకి రాగానే వెంటనే సూట్కేస్ అందుకున్నాను.

భారతీయులం నలుగురం ఎవరి సామాన్లు వారు చేత్తో పట్టుకుని విమానాశ్రయం బయటకు వచ్చాం. అక్కణ్ణించి బస్సులో రైల్వేస్టేషనుకి వెళ్లాలిట. బస్సుకోసం ఎదురుచూస్తూ అక్కడ నిలబడ్డాం.

అదిగో నవలోకం

ఎయిర్ పోర్ట్ లోపలికంటే బయట బాగా చల్లగా ఉంది.

మాలో ఇద్దరు ఫు ల్ సూట్స్ లో, ఒకతను స్వెటర్తో ఉన్నారు. నా స్వెటర్ నా భుజంమీదనే ఉంది. జీవితంలో అంతవరకూ ఎన్నడూ స్వెటర్ వేసుకుని ఉండని కారణంగా ధరించడానికి కాస్త మొహమాటంగా ఉంది.

చుట్టూ చూస్తుంటే అది మనుషులు మసిలే ప్రదేశంలా అనిపించలేదు. ఏదో అద్భుతలోకంలో ఉన్నట్లుంది.

నేలంతా అప్పుడే కడిగి తుడిచిన భోజనాలగదిలా శుభ్రంగా ఉంది. మాకు కాస్త దూరంలో కొందరు జర్మన్ బాలబాలికలు ఆడుకుంటున్నారు. వాళ్లంతా ఏదో పిక్నిక్కి వచ్చిన బాపతులా ఉన్నారు. బలంగా ధృడంగా ఉన్నా వాళ్ల ఆటలు మోటుగా ఉన్నాయి. మిసమిసలాడే వాళ్ల సోయగాల్ని చూసి ప్రపంచంలోని బాలబాలికలంతా అలా కనిపించే మంచి రోజు ఎప్పటికి వస్తుందో అనిపించింది అప్రయత్నంగా.

కాసేపు ఎదురుచూశాక బస్సు వచ్చింది. త్వరగా ఎక్కాం. కాస్త రష్గానే ఉంది. మాకు కూర్చునేందుకు సీట్లు దొరకలేదు. అయితే నిలబడదానికి అనువుగా విశాలమైన స్థలముంది. నిలబడ్డవాళ్లు ఒకరికొకరు తగులుతూ ఉండనవసరంలేదు. బస్సు లోపల సెంట్రల్ హీటింగ్ సిస్టం ఉండడంవల్ల వెచ్చగా, హాయిగా ఉంది.

బస్సులో కండక్టర్ లేదు. డ్రైవర్ సీటు దగ్గరనుంచే ఎక్కాలి. అతను టిక్కెట్ ఇస్తాడు. విమానాశ్రయంనుంచి రైల్వేస్టేషనుకు టిక్కెట్ ఖరీదు ఒక మార్కు. కాస్త ఎక్కువేననిపించింది. జర్మనీలో నేను పెట్టిన మొదటి ఖర్చు ఈ బస్సు టిక్కెట్టే.

అంతా బస్సెక్కగానే డ్రైవర్ ఒక బటన్ నొక్కాడు. వెంటనే చిన్నగా శబ్దం చేస్తూ బస్సు తలుపులు వాటంతటవే మూసుకుపోయాయి. మధ్యలో ఎవరైనా ఎక్కడైనా దిగాలంటే డ్రైవర్ ఓ మీట నొక్కుతున్నాడు. తలుపులు వాటంతటవే తెరుచుకుంటున్నాయి. అందువల్ల డ్రైవర్ ఇష్టం లేనిదే ఎవరూ బస్సు ఎక్కలేరు, దిగలేరు. ట్రాఫిక్ కారణంగా బస్సు మధ్యలో ఆగినా అందులోంచి ఎవరూ దిగిపోలేరు. అందులోకి ఎవరూ ఎక్కలేరు. ఈ పద్ధతి చాలా బాగుందనిపించింది.

బస్సు వెడుతున్నప్పుడు కళ్లప్పగించి ఊరు చూశాం. ఆ అందం చూసి ఆనందించాల్సిందే కానీ వర్ణించలేను. బస్సు వెడుతుంటే ఎక్కడా దుమ్ము లేవడంలేదు. ఊరంతా ఉద్యానవనంలా ఉంది.

హనోఫర్ రైల్వేస్టేషన్ వద్ద మేము నలుగురం ట్రయిన్ దిగాం. మలేషియన్స్ కూడా మా వెనుకనే దిగారు. ఇంకా వాళ్లూ, మేమూ విడిగా రెండు గుంపులుగానే ఉన్నాం.

రైల్వేస్టేషన్ చాలా గజిబిజిగా ఉంది. మా ట్రైన్ సరిగ్గా ఒంటిగంటా ఎనిమిది నిముషాలకు రావాలి. అది ఏ ప్లాట్ ఫాం మీదకు వస్తుందో తెలుసుకోవడానికి కాస్సేపు పట్టింది. వివరాలన్నీ జర్మన్ భాషలో రాసి పెట్టి ఉన్న చార్ట్ ఒకటుంది. దాన్ని అర్థం చేసుకుందుకు మాకు కాస్సేపు పట్టింది. అదృష్టమేమిటంటే జర్మన్, ఇంగ్లీషు భాషలకు అక్షరాలు ఒకటే. అది మాకు చాలా సహకరించింది. మేము సేకరించిన సమాచారం సరైనదవునో కాదో అక్కడ మరికొందరిని అడిగి నిర్ధారించుకున్నాం. అప్పుడే మాకు అర్థమైంది – మా ఇంగ్లీషు పరిజ్ఞానం అక్కడ మాకాట్టే సహకరించదని!

ఆ సందర్భంలో మేమూ, మలేషియన్సూ కొంచెం దగ్గరయ్యాం. వాళ్ల స్నేహితుడొకడు హనోఫర్లో ఉన్నట్లున్నాడు. అతను స్టేషన్ కొచ్చి వాళ్లను కలుసుకుని వాళ్లతోపాటు అనుకోకుండా మాక్కూడా సాయపడ్డాడు.

ట్రైన్ సరిగ్గా టైముకి వచ్చింది. రెండంటే రెండు నిముషాల్లో బయల్దేరింది. చాలా పరిశుభ్రంగా ఉంది. మాది సెకండ్ క్లాస్ కంపార్ట్మెంట్. అది మన బోగీల్లా కాక – ఎంతో విశాలంగానూ, కాళీగానూ ఉంది.

ట్రైన్ వెడుతున్నది అడవిదారిలా ఉంది. చెట్లు పొడుగ్గా, పచ్చదనంతో మెరిసిపోతున్నాయి. ఇండియాలో చెట్లకి పచ్చదనం చూశాను కానీ ఆ పచ్చదనానికీ, ఈ పచ్చదనానికీ తేడా ఉంది. లేత ఆకుపచ్చ కొద్దిగా ముదిరినట్లు, ముదురాకుపచ్చ కొద్దిగా లేతపడినట్లు – అదొక రకమైన, అందమైన, అద్భుతమైన పచ్చదనం నన్ను వివశుణ్ణి చేసింది.

ట్రైన్లో మాకో కుర్రాడు తగిలాడు. పది పన్నెండేళ్లుండవచ్చు. అందరు జర్మన్ కుర్రాళ్లలాగే పుష్టిగా ఉన్నాడు. మాతో ఏదో మాట్లాడడానికి ప్రయత్నించాడు. వచ్చీరాని ఇంగ్లీషులో తడబడుతూ మాట్లాడాడు. ఒక యూరోపియన్ బాలుడు ఇంగ్లీషు మాట్లాడడానికి తడబడడం వింతగా అనిపిస్తే – అంతకంటే వింతైనది అతని తీరు. అతనివద్ద పూర్తి టికెట్ కొనడానికి డబ్బులు లేవుట. కొన్ని మార్కులు సాయం చేయమని అడిగాడు.

ఇండియాలో ఇలాంటివి చాలా మామూలే! జర్మనీలో అడుగు పెట్టగానే ఇటువంటి అనుభవం ఎదురౌతుందని మేము అనుకోలేదు.

అయితే అతను చెప్పింది మాకు సరిగా అర్థం కాలేదు. డబ్బు కావాలన్నదొక్కటే సరిగా తెలిసింది. అతని అసలు సమస్య ఏమిటో మాకు తెలియదు. అప్పుడే కొత్తగా ఓ కొత్తదేశంలోకి అడుగుపెట్టిన మేము మా దగ్గరున్న కొద్ది మార్కుల్నీ దానధర్మాలు చేయగల స్థితిలో లేము. అందువల్ల మా అసహాయత అతనికి తెలియబర్చాము. నిరుత్సాహంగా వెళ్లిపోయాడా కుర్రాడు.

దేశం సంపన్నమైనప్పటికీ, ఇక్కడ కూడా మనుషుల తీరు ఇండియాలోలాగే ఉందని అనుకున్నాము. అయితే దానికి ఆలోచనల్లో మరీ ఎక్కువ ప్రాధాన్యతనివ్వలేదు. చేరవలసిన టైమ్ ప్రకారం రెండుగంటల నలభైఅయిదు నిముషాలకు ట్రైన్ ల్యూనబెర్గ్ చేరుకుంది. అది అగిన రెండే రెండు నిముషాల్లో హడావుడిగా సామానులతో సహా ట్రైన్లోంచి దిగాం.

విమానాశ్రయంలోనూ, రైల్వేస్టేషన్లోనూ కూడా సామాన్ల రవాణాకు ట్రాలీలున్నాయి. వాటిలో సామానుంచి లాక్కుంటూ బయటకు చేర్చుకుని, ట్రాలీ అక్కడ వదిలేయొచ్చు. మా సామాను బరువుగా లేకపోవడంవల్ల ట్రాలీ ఉపయోగించాల్సిన అవసరం లేకపోయింది.

స్టేషన్ ఆవరణలో కూడా ఇండియన్సూ, మలేషియన్సూ మళ్లీ విడివిడిగానే ఉన్నాం. మలేషియన్సు మాకంటే ముందు టాక్సీలో వెళ్లిపోయారు. మావద్ద గ్యోతే ఇన్స్టిట్యూట్ అడ్రస్ ఉంది. అక్కడికి ఎలా వెళ్లాలీ అని కాసేపు తర్జనభర్జన పడి, చివరకి టాక్సీ చేసుకుని వెళ్లాలనుకుని దగ్గర్లో ఉన్న టాక్సీని పిలిచాం.

టాక్సీ మనదేశంలో గొప్పగొప్పవాళ్లు వాడే కార్లకంటే గొప్పగా ఉంది. టాక్సీడ్రైవర్ చూడ్డానికి పెద్ద ఆఫీసర్లా ఉన్నాడు. అయితే మేము అడ్రస్ చూపించగానే అతను ఎంతో వినయంగా మా సామాను డిక్కీలో పెట్టాడు. మాకు భాష రాదని తెలిసి మావంక స్నేహపూర్వకంగా చూశాడు. అతనికి ఇంగ్లీషు వచ్చినట్లు లేదు. ఐనా వ్యవహారానికి పెద్దగా ఇబ్బంది కలుగలేదు.

గ్యోతే ఇన్స్టిట్యూట్కి మీటర్ ఛార్జి నాలుగు మార్కులయ్యింది. అది మేము నలుగురం షేర్ చేశాం. టాక్సీ చవగ్గానే ఉంది. అనవసరంగా తటపటాయించాం, అనుకున్నాం.

గ్యోతే ఇన్స్టిట్యూట్ దగ్గర దిగాం. ఇన్స్టిట్యూట్ భవనం చూడ్డానికి చిన్న మేడలాఉంది. ఒకే ఒక్క గుమ్మం. తలుపు మూసి ఉంది. లోపలికెళ్లడానికి మరో దారి లేదు.

టాక్సీ డ్రైవర్ సామాను దింపడంలో సాయం చేశాక, తలుపుకి పక్కనే ఉన్న కాలింగ్ బెల్ చూపించి అది నొక్కమని సూచించి వెళ్లిపోయాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments